క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకంగా అలంకరించిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని,108 సాలాగ్రామ శివలింగాలను దర్శించుకున్నారు. భక్తుల సౌకార్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సీఐ బాధ్యతల స్వీకరణ


సీఐ రాజశేఖర్‌రెడ్డి

పామిడి: పామిడి సీఐగా రాజశేఖర్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న కిరణ్‌కుమార్ రెడ్డిని ఎస్పీ కార్యాయానికి అటాచ్ చేశారు. ఎస్పీ కార్యాలయ అటాచ్‌మెంట్‌లో ఉన్న సీఐ రాజశేఖర్‌రెడ్డి బదిలీపై వచ్చారు. నూతన సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ షేక్ చాంద్‌బాషా, పోలీసులు పాల్గొన్నారు.

సెంట్రల్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌గా అఖిల్



గుత్తి: పట్టణంలోని కురుబ వీధికి చెందిన ఆకుతోట రంగనాయకులు, రేఖ కుమారుడు అఖిల్ సెంట్రల్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ నెల 24న ఘజియా బాద్‌లో అఖిల్ సెంట్రల్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. అఖిల్‌కు పట్టణవాసులు, బంధువులు, మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

సినీనటుడు సాయికుమార్‌కు సన్మానం


నటుడు సాయికుమార్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

తాడిపత్రి అర్బన్: ఓ షూటింగ్ నిమిత్తం తాడిపత్రికి వచ్చిన సినీ నటుడు, బీజేపీ నాయకుడు సాయికుమార్‌ను స్థానిక బీజేపీ నాయకులు కలిశారు. ఆదివారం పట్టణంలోని ఓ హోటల్‌లో ఉంటున్న నటుడు సాయికుమార్‌ను పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పీపీ ప్రతాప్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ రంగనాథ్‌రెడ్డి తదితరులు కలిశారు. ఈ సందర్భంగా సాయికుమార్‌కు పుష్ప గుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు.

పోటా పోటీగా కబడ్డీ పోటీలు


ఎగువపల్లిలో కబడ్డీ విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని ఎగువపల్లిలో గాలెమ్మ జాతర సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. కబడ్డీ పోటీల్లో 24 టీములు పాల్గొనగా, శనివారం అర్ధరాత్రి వరకు పోటీలు పోటాపోటీగా జరిగాయి. కర్నూలు జిల్లా ప్యాపిలి జట్టు మొదటి స్థానంలో, అనంతపురానికి చెందిన వివేకానంద జట్టు రెండో స్థానం, తాడిపత్రి జట్టు మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు మొదటి బహుమతి రూ.10,016, రెండో బహుమతిగా రూ.7016, మూడో బహుమతిగా రూ.4016 నగదు అందజేశారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ


చోరీ జరిగిన ఆలయం

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లి పెద్దమ్మ ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామంలోని అనంతపురం – తాడిపత్రి రహదారి పక్కన ఉన్న పెద్దమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అమ్మవారి వెండి ముఖ కవచం, గొడుగులు 70 తులాల వరకు ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుంది. నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

రహదారుల అభివృద్ధికి నిధులు

- భోగేశ్వరాలయానికి సీసీ రోడ్డు ఏర్పాటుకు చర్యలు
- భక్తుల రాకపోకలకు సుగమం

పామిడి: మండల కేంద్రంలో రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల నిధులు మంజూరు చేసింది. మొత్తం 20 వార్డుల్లో సీసీ రోడ్లు వేయనున్నారు. ఇరుకుగా ఉన్న పట్టణంలోని భోగేశ్వరాలయం వీధి వెడల్పు చేయనుండడంతో భక్తులతో పాటు కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 16వ శతాబ్దంలో చోళుల హయాంలో ఈ ఆలయం నిర్మించబడింది. ఈ ఆలయానికి ఆనుకొని ఉన్న వడ్డేవీధికి వందేళ్లు. భోగేశ్వరాలయ ముఖతోరణం వడ్డేవీధి ప్రారంభంలో నిర్మించారు. ఈ వీధిలో దాదాపు 500 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ వడ్డే వీధి మీదుగానే భోగేశ్వరాలయానికి వెళ్లాల్సి ఉంది. ఈ రోడ్డు ఇరుకుగా ఉండడంతో వడ్డేవీధివాసులతో పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిపడేవారు. ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన, వివాహాది శుభకార్యకలాలకు ఈ ఇరుకుమయమైన రోడ్డు వల్ల చక్రబంధం ఏర్పడేది. దీంతో భక్తాదులు, వాహనదారుల ఆగచాట్లు చెప్పనలవి కానివి. ఈ సమస్యను గుర్తించి ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి రోడ్డు వెడల్పుకు చర్యలు చేపట్టారు. మరో వారం రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభం కానుండడంతో వడ్డేవీధి వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పామిడి భోగేశ్వరాలయ ముఖద్వారం

వెడల్పు రోడ్డు అవసరం



పవిత్ర ప్రముఖ శైవ క్షేత్రమైన భోగేశ్వరాలయం రోడ్డు ఇరుకుగా ఉంది. మహాశివరాత్రి వంటి పర్వదినాన ఆలయ రోడ్డు భక్తులతో కిక్కిరిసి పోతుంది. ఆసమయంలో భక్తాదులు పడే అగచాట్లు చెప్పనలవి కానిది. ఎమ్మెల్యే వైవీఆర్ చొరవతో రోడ్డు వెడల్పు నోచుకోబోతుండడం ఆనందదాయకం. –శంకర్, వడ్డేవీధివాసి, పామిడి.

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



పామిడి భోగేశ్వరాలయానికి వెళ్లే రోడ్డుపై రెండు ఆటోలు ఎదురెదురుగా వెళ్ళలేని పరిస్థితి. దీంతో అప్పుడప్పుడు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. ఎమ్మెల్యే వైవీఆర్ కృషితో రోడ్డు నిడివితో కూడిన ఆధునీకరణపై ఎమ్మెల్యేకు వడ్డేవీధివాసులం సర్వదా రుణపడి ఉంటాం. –అంజనమ్మ, వడ్డేవీధివాసి, పామిడి

టిప్పు సుల్తాన్ ముస్లిమీన్ కమిటీ ఎన్నిక


కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లు: టిప్పు సుల్తాన్ ఇత్త హాద్దుల్ ముస్లిమీన్ పట్టణ కమిటీని ఎన్నుకున్నట్లు ఆ కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎండీఆర్ ఖలీల్, జిల్లా ఇంచార్జ్ మౌలా తెలిపారు. ఆదివారం టిప్పు సుల్తాన్ ముస్లిమున్ కమిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడిగా దాదాఖలందర్, గౌరవ అధ్యక్షులుగా రంజాన్, అక్రమ్‌బాషా, ఉపాధ్యక్షులుగా షేక్ సిరాజ్, బషీర్, జనరల్ సెక్రటరీగా బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీగా మహమ్మద్ ఇమ్రాన్, జాయింట్ సెక్రటరీలుగా కొనకొండ్ల వలి, సిలార్, షెక్షావలి, సోషల్ మీడియా కన్వీనర్‌గా మహబుబ్‌బాషా, జనరల్ అడ్వైజర్‌గా మజీద్, ట్రెజరర్‌గా దాదాపటాన్‌లతోపాటు 30 మంది కమిటీ సభ్యులతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

తాడిపత్రి అర్బన్: విద్యార్థులందరూ దేశ సమగ్రతకు కట్టుబడి ఉండాలని ఏబీవీపీ పిలుపునిచ్చింది. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్ కన్వీనర్ భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా ఏబీవీపీ 1948లో అనధికారికంగా ప్రారంభమై 1949 జులై 9న అధికారికంగా రూపాంతరం చెందిందన్నారు. ఐదు వేల మందితో ప్రారంభమైన ఏబీవీపీ నేడు 35 లక్షల మంది విద్యార్థులపై చిలుకు సభ్యత్వం పొంది దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి హరినారాయణ, నాయకులు మంజు, బాబా, హర్ష తదితరులు పాల్గొన్నారు.

కుక్క దాడిలో రైతుకు గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని ఇసురాళ్లపల్లిలో కుక్క దాడి చేయడంతో రైతు బాల ఓబుళరెడ్డి గాయపడ్డాడు. బాధిత రైతు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాల ఓబుళరెడ్డి ఆదివారం వేకువజామున పొలంలో పని చేసేందుకు నడుచుకుంటూ బయలుదేరాడు. చీకట్లో నడుచుకుంటూ వెళ్తూ కుక్క తోక తొక్కడంతో రైతుపై దాడి చేసి గాయపరిచింది. కుటుంబీకులు వెంటనే క్షతగాత్రుడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆరేళ్ల తర్వాత మిస్సింగ్ కేసు నమోదు


చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

యాడికి: ఆరేళ్ల క్రితం మండలంలోని చిక్కేపల్లె గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి (58) ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు పలుచోట్ల వెతికినా కనిపించలేదు. ఆదివారం చంద్రశేఖర్‌రెడ్డి భార్య ఎరుకలమ్మ ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు.. పెద్దవడుగూరు మండలానికి చెందిన నారపరెడ్డి అనే వ్యక్తి టీవీఎస్‌పై అనంతపురం వెళ్తుండగా, తీరా ఘటనాస్థలం వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనింది. ఈ ప్రమాదంలో నారపరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి అతన్ని చికిత్స నిమిత్తం సర్వజనాస్పత్రికి తరలించారు.

మాతాశిశువులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్

అనంతపురం క్రైం: మాతా,శిశువులకు అందించే సేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ వైద్యాధికారులను ఆదేశించారు. ఆదివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందితో మాతాశిశు ఆరోగ్య సేవలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను డీఎంహెచ్‌ఓ తెలియజేశారు. గర్భస్థ ఆరోగ్య సేవలు, గర్భిణుల రిజిస్ట్రేషన్, ఎంసీపీ కార్డుల అందజేత, హిమోగ్లోబిన్, హెపటైటిస్ బీ పరీక్ష, టీటీ ఇంజెక్షన్, బర్త్ ప్లానింగ్, రవాణా సౌలభ్యం, తదితర సేవలపై ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పక పాటించాలన్నారు. హైరిస్క్ సేవలపై జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మనోజ్, డాక్టర్ మహేంద్రనాథ్, డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ సహీబా, సిబ్బంది మారుతీప్రసాద్, డెమో ఉమాపతి, గంగాధర్ పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగ సంఘం ప్రతినిధుల ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు

రాప్తాడురూరల్: బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం ఏలూరులో జరిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్టా శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏజీ నాగభూషణం, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఓ బలరాముడు హాజరై ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే అప్పయ్యచౌదరి, మాజీ మంత్రి రంగారావు హాజరయ్యారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్స్‌లో రిజర్వేషన్స్, క్రీమీలేయర్, బీసీ భవన నిర్మాణం తదితక సమస్యలపై చర్చించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈజీ నాగభూషణం తెలిపారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

యల్లనూరు : మండలంలోని పాతపల్లి, కృష్ణాపురం గ్రామాల్లో సోమవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ ప్రతాప్‌రెడ్డి శనివారం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ, మండల కన్వీనర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని తలగాచిపల్లి క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. తిమ్మంపేటకు చెందిన కృష్ణారెడ్డి, నారపరెడ్డి ద్విచక్రవాహనంపై గార్లదిన్నెకు వెళ్తుండగా, తీరా తలగాచిపల్లి వద్దకు రాగానే వెనుక నుంచి ఐచర్ వాహనం ద్విచక్ర వాహన్ని ఢీకొనింది. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బైక్ బోల్తా ..


గాయపడిన పెద్దన్న

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో గోల్డెన్ కేఫ్ వద్ద బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో పెద్దన్న, శివ తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. శింగనమలకు చెందిన పెద్దన్న, శివ బైక్‌లో గుత్తికి వచ్చారు. తిరిగి శింగనమలకు వెళుతుండగా గోల్డెన్ కేఫ్ వద్ద ఆటో అడ్డం వచ్చింది. ఆటోను తప్పించబోయి బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నేడు 'స్పందన'

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మహబూబ్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభయ్యే 'స్పందన'లో ఫిర్యాదు చేసే వారు దరఖాస్తులో ఆధార్, సెల్ ఫోన్ నంబర్ వేయాలని ఆయన సూచించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

కంటి వైద్య శిబిరం రేపు

పామిడి: పట్టణ భావసార క్షత్రియ కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పామిడి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు కంటి ఆస్పత్రి సౌజన్యంతో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు ఆదివారం తెలిపారు. శిబిరంలో ఆ ఆసుపత్రి ప్రముఖ కంటి వైద్య నిపుణులచే ఉచిత పరీక్షలతో పాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు.

రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో నేడు చండీ హోమం

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో ఉన్న రేణుకా ఎల్లమ్మ దేవాలయం, వినాయకుడి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు , అభిషేకాలతో పాటు చండీ హోమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. తెల్లవారు జామున 5.30 గంటలకు చండీ హోమం నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని వారు కోరారు.

దస్తగిరిస్వామి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు


దస్తగిరి స్వామి దర్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి: మండలంలోని బందార్లపల్లి గ్రామంలోని దస్తగిరి స్వామి దర్గాలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దస్తగిరి స్వామి ఉరుసును పురస్కరించుకుని ఆయన దర్గాకు వెళ్లారు. ఉరుసు కార్యక్రమంలో పాల్గొని కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గాలోని దస్తగిరి స్వామికి పూల పాతేహా సమర్పించి, చక్కెర చదివింపులు చేయించారు.

ఘనంగా గాలెమ్మ జాతర


ఎగువపల్లిలో ప్రత్యేక అలంకరణలో గాలెమ్మ

గార్లదిన్నె: మండలంలోని ఎగువపల్లిలో ఆదివారం గ్రామస్తులు గాలెమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పంటలు పండి, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఏటా ఆషాఢ మాసంలో గాలెమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీ. గాలెమ్మ దేవతను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు,అర్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు.

దైవచింతనే మోక్ష మార్గం


నార్పలలో కలసిన ముస్లింలు

నార్పల: ప్రతి ఒక్కరికీ దైవచింతనే మోక్ష మార్గమని అనంతపురం మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్‌బాషా, మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఈద్గా మైదానంలో ముస్లింల సమావేశం నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి ముస్లింలు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అనంతపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్ బాషా, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి నూతనంగా నిర్మించిన మదరసాను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముస్లింలు మదరసాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మౌలానా షామీర్, జిల్లా బాధ్యులు అమీర్ బాషా, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

రజకుల మహాసభను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న రజక సంఘం నేత లింగమయ్య

పెద్దవడుగూరు: జిల్లాలోని రజకుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా రజక సంఘం నాయకులు లింగమయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రమైన పెద్దవడుగూరులోని గంగమ్మతల్లి దేవాలయంలో రజకుల సమావేశం నిర్వహించారు. లింగమయ్య మాట్లాడుతూ పెద్దవడుగూరులో రజకులకు పట్టాలు పంపిణీ చేయాలని, దోబీఘాట్లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈనెల 21న అనంతపురంలో జరిగే మహాసభకు పెద్ద ఎత్తున రజకులు తరలిరావాలన్నారు. అనంతరం పోస్టర్‌లను విడుదల చేశారు.

బహిరంగ సభ జయప్రదం చేయండి


పోస్టర్లు విడుదల చేస్తున్న సంఘం నేతలు

గుంతకల్లు: గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 23న నిర్వహించే ప్రజా సింహగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని రాయలసీమ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రజా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అలం నవాజ్, మహేంద్రలు పిలుపునిచ్చారు. ఆదివారం అ సంఘం కార్యాయంలో ప్రజా సింహగర్జన పోస్టర్లను విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కుల సాధన కోసం నిర్వహించే ఈ సభకు పార్టీలు, మతాలకు అతీతంగా ప్రజలు విరివిగా హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డాక్టర్ సందేమధవరావు, లక్ష్మీనారాయణ, గాలి మల్లికార్జున, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' సద్వినియోగం చేసుకోండి

పామిడి: మండలంలోని కండ్లపల్లి పాత సచివాలయ ఆవరణలో ఈ నెల 11న నిర్వహించే జగనన్న సురక్ష పథకంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అర్హులకు ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తున్నామన్నారు.

గుత్తి రూరల్: మండలంలోని వన్నేదొడ్డి గ్రామంలో ఈ నెల 11న జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవాకం ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని, ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలన్నారు.


పుట్లూరు: మండలంలోని తక్కళ్లపల్లి, శనగలగూడూరు గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటి సర్వే చేపట్టారన్నారు.

యల్లనూరు: మండల కేంద్రంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీరరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని పెద్దొడ్డి గ్రామ శివారులో ఆదివారం ద్విచక్రవాహనం అదుపు తప్పి హనుమంతురెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఇసురాళ్లపల్లికి చెందిన హనుమంతురెడ్డి గుంతకల్లు మండలం నెలగొండ గ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. పెద్దొడ్డి క్రాస్ మలుపు వద్ద వేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనం బోల్తా పడింది. ఘటనలో కుడికాలు విరిగి తీవ్రంగా గాయపడిన అతడిని 108లో గుత్తి ప్రభుతాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతి


మృతిచెందిన శ్యాంసుందర్

గుత్తి: పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన శ్యాం సుందర్(56) అనే వ్యక్తి ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. బీసీ కాలనీలో నివాసముండే ఆయన ఆదివారం ఉదయం ఇంట్లో కుప్ప కూలి కింద పడ్డాడు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.